సాక్షి
తిరుపతి
గురువారం । 15 । మే । 2025



ఉద్యోగం..లక్ష్యానికి ఆరంభం
తిరుపతి సమీపంలోని ఎంబీయూలో బుధవారం ఘనంగా అచీవర్స్ డే =2025 నిర్వహించారు. - 8లో



అరకొరగా 'వసతి'
తిరుపతిలో టీటీడీ వారు నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలల హాస్టళ్లలో అరకొరగా సీట్లు ఉన్నాయి. - 8లో



నిధుల సేకరణకు యాక్షన్‌ప్లాన్
టీటీడీ ఆధ్వర్యంలోని ఆస్పత్రుల నిర్వహణ కోసం నిధుల సేకరణకు యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేసినట్లు టీటీడీ చైర్మన్ తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీకి 835 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో భాగంగా బుధవారం నిర్వహించిన మ్యాథ్స్–1ఏ, 2ఏ, బోటనీ, సివిక్స్ పరీక్షలకు 835 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ప్రథమ సంవత్సరం పరీక్షకు 16,256మంది, ద్వితీయ సంవత్సరం ఎగ్జామ్‌కు 1,981మంది హాజరైనట్లు వివరించారు.

మహిళా వర్సిటీలో రోడ్డు పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న వీసీ ఉమ

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 21 అడుగుల రోడ్డు నిర్మాణ పనులను వీసీ ప్రొఫెసర్ వి.ఉమ బుధవారం ప్రారంభించారు. తుడా చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసులు మాట్లాడుతూ సుమారు రూ. 38 లక్షల వ్యయంతో అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ నుంచి హ్యుమానిటీస్ బ్లాక్– 2 వరకు రోడ్డు విస్తరణ చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని పాల్గొన్నారు.

ఖేలో ఇండియాలో సత్తా చాటిన లక్ష్మీసిరి



గూడూరురూరల్ : బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా పోటీల్లో గూడూరుకు చెందిన లక్ష్మీసిరి సత్తా చాటింది. మంగళవారం జరిగిన టెన్నిస్ సింగిల్స్ పోటీల్లో పాల్గొని కాంస్య పతకం కైవసం చేసుకుంది. అలాగే డబుల్స్ విభాగంలో రజత పతకం గెలుచుకుంది. ఈ సందర్భంగా బుధవారం లక్ష్మీసిరి తండ్రి దండు మహేష్ రెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు.

పంట కోత ప్రయోగం విజయవంతం

పాకాల : మండలంలోని ఈ–పాలగుట్టపల్లెలో ఎస్.బాలరాజునాయుడు అనే రైతు పొలంలో చేపట్టిన వరి కోత ప్రయోగం విజయవంతమైనట్లు ఎంసీఆర్‌పీ రాధాకృష్ణ తెలిపారు. బుధవారం ఈ మేరకు ప్రకృతి వ్యసాయంలో పండించిన వరి పంటను ఐదుకు ఐదుకు పరిధిలో పంట కోత చేపట్టారు. ఈ క్రమంలో పంట 14 కేజీల 516 గ్రాముల దిగుబడి వచ్చిందని అధికారులు వెల్లడించారు. ప్రకృతి వ్యసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఐడీఆర్‌పీ ఇన్వెస్టిగేటర్ గిరి పాల్గొన్నారు.


గంగమ్మ విశ్వరూప దర్శనానికి తరలివచ్చిన భక్తులు

తిరుపతిలో ఏడురోజులపాటు వైభవోపేతంగా సాగిన శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర బుధవారం వేకువజామునతో పరిపూర్ణమైంది. ఈ సందర్భంగా అశేష భక్తజనం అమ్మా.. గంగాభవానీ.. చల్లగా చూడు తల్లీ అంటూ ప్రణమిల్లింది. సకల పాపాలను హరించే గ్రామదేవతను కుటుంబ సమేతంగా సేవించుకుని పులకించింది. దేదీప్యంగా సాక్షాత్కరించిన అమ్మవారి విశ్వరూపాన్ని కనులారా వీక్షించి తరించింది. శక్తిస్వరూపిణిని భక్తిప్రపత్తులతో పూజించుకుని మొక్కులు చెల్లించుకుంది. మహిమాన్విత ప్రతిమ చెంప నరికే ఘట్టంలో పాలుపంచుకుని మురిసిపోయింది. అత్యంత పవిత్రమైన విగ్రహ మట్టిని స్వీకరించి పరవశించింది.

దేదీప్యం.. దివ్యరూపం

ఘనంగా ముగిసిన శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర

- అమ్మవారి విశ్వరూప దర్శనానికి పోటెత్తిన భక్తులు
- పేరంటాలు వేషంతో తరలివచ్చిన కైకాల కులస్తులు
- పవిత్ర ప్రతిమ చెంప నరకడంతో పరిపూర్ణమైన వేడుకలు


శ్రీతాతయ్యగుంట గంగమ్మ విశ్వరూపం

తిరుపతి కల్చరల్ : శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర వైభవంగా సాగింది. ఏడు రోజులపాటు నిర్వహించిన జానపద జాతరను పురస్కరించుకుని లక్షలాది మంది భక్తులు తరలివచ్చి గంగమ్మతల్లిని దర్శించుకున్నారు. వివిధ వేషాలు ధరించిన భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని సేవించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లికి ఎదుట పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.


ప్రతిమ మట్టి కోసం ఎగబడుతున్న భక్తులు

పోటెత్తిన భక్తులు

గంగజాతర చివరి రోజు సందర్భంగా తిరుపతి నగర వీధులు భక్తులతో కిక్కిరిశాయి. గంగమ్మ నామస్మరణలు, జాతర వేషాల సందడి, డప్పుల మోతతో హోరెత్తాయి. జాతర చివరి రోజైన మంగళవారం అర్ధరాత్రి తర్వాత శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ప్రత్యేకంగా కొలువుతీరిన అమ్మవారి విశ్వరూప ప్రతిమ దర్శనంతో భక్తులు ఆనంద పారవశ్యంలో మునిగిపోయారు. కరుణించి కాపాడు తల్లీ అంటూ చేతులెత్తి మొక్కుతూ వేడుకున్నారు.

ప్రత్యేక గ్యాలరీలు

ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుల సహకారంతో భక్తులకు పటిష్ట ఏర్పాట్లు చేశారు. గంగమ్మ విశ్వరూపాన్ని భక్తులందరూ దర్శించుకునేందుకు ఆలయ ఆవరణలో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేయించారు. ముందుగా కైకాల కులస్తుడు పేరంటాలు వేషం ధరించి పురవీధులు విహరిస్తూ భక్తుల పూజలందుకున్నారు. బుధవారం వేకువ జామున శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి పేరంటాలు చేరుకున్నారు. గంగమ్మతల్లి విశ్వరూప ప్రతిమ చెంప నరికారు. అత్యంత పవిత్రంగా భావించే విశ్వరూప ప్రతిమ బంకమట్టి కోసం పోటీపడ్డారు. అనంతరం పేరంటాలు శ్రీతాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయానికి చేరుకొని పెద్ద గంగమ్మ విశ్వరూప ప్రతిమ చెంప నరకడంతో జాతర ఘట్టం పరిపూర్ణమైంది.

పాలిసెట్‌లో బాలికలదే పైచేయి

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 30వ తేదీన నిర్వహించిన పాలిసెట్–2025 ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. జిల్లా నుంచి 96.26శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బాలురు 2,989మందికి గాను 2,853మంది (95.45శాతం), బాలికలు 1,661మంది పరీక్ష రాయగా 1,623 (97.71శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది బాలికలే పై చేయి సాధించినట్లు తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్, పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ వై.ద్వారకనాథ్‌రెడ్డి తెలిపారు.

జిల్లా టాపర్లు వీరే..

పాలిసెట్ ఫలితాల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. సిద్దగుంట జతిష్ మోహన్‌సాయి 120మార్కులకు 119మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 51వ ర్యాంకు, జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు దక్కించుకున్నాడు. పల్లేటి సిద్ధార్థ 119మార్కులతో 66వ ర్యాంకు, నల్లాకుకల మోహిత్ 118మార్కులతో 114వ ర్యాంకు సాధించి జిల్లా టాప్ 3 స్థానాల్లో నిలిచారు. ఎస్వీయూ రీజియన్ పరిధిలో బాలుర విభాగంలో అహైక్ ఖాదర్ బాషా, కురువ సాత్విక్, సిద్దగుంట జతీష్ మోహన్‌సాయి 119మార్కులతో మొదటి మూడు ర్యాంకులు, బాలికల విభాగంలో నిమ్మనపల్లి హారికా మోహన్ 119, వెన్నపూస చంద్రకళ 118, సిద్దవటం వెంకటకీర్తి 117మార్కులు సాధించి తొలి మూడు ర్యాంకుల్లో నిలిచారు.

తుడా సెక్రటరీగా శ్రీకాంత్ బాబు



తిరుపతి తుడా : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) సెక్రటరీగా డాక్టర్ ఎస్వీ శ్రీకాంత్ బాబును నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. శ్రీకాళహస్తి ప్రాంతీయ పశువుల ఆస్పత్రిలో సహాయ సంచాలకుడిగా పనిచేస్తున్న శ్రీకాంత్ బాబుని డిప్యుటేషన్‌పై తుడా సెక్రటరీగా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 3 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 74,477 మంది స్వామివారిని దర్శించుకున్నారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 2 గంటల్లో దర్శనమవుతోంది.

గంగ దర్శనం.. గందరగోళం

- పేరంటాలు వేషధారికి అవమానం
- గేట్లు తీయకపోవడంతో అలిగి వెళ్లిపోయిన పేరంటాలు
- టీడీపీ నేతలకే ప్రాధాన్యమిస్తున్నారని జనసేన శ్రేణుల ఆగ్రహం
- జాతర నిర్వహణ తీరును ప్రశ్నించిన భక్తుడిపై పోలీసుల ప్రతాపం
- తోపులాట.. తొక్కిలాట మధ్య ముగిసిన గంగ జాతర


పోలీసులతో భక్తుడి వాగ్వాదం

సాక్షి ప్రతినిధి, తిరుపతి : తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర చివరి ఘట్టం విశ్వరూప దర్శనం గందరగోళంగా మారింది. జాతర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తోపులాటలు, ఆందోళనలు, ఆవేదనలు, అవమానాల నడుమ జాతర ముగిసింది. కూటమి నేతలు, అధికారుల మధ్య అవగాహన లేకపోవడంతో జాతర నిర్వహణ మొత్తం అయోమయంగా సాగింది. ప్రతిష్టాత్మక తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతర బుధవారం వేకువ జామున విశ్వరూప దర్శనంతో ముగిసింది. వారం రోజులు పాటు జరిగిన గంగ జాతరను కూటమి ప్రభుత్వం తూతూ మంత్రంగా నిర్వహించి విమర్శలను మూటగుట్టుకుంది. గంగ జాతరలో అతి ముఖ్యమైన ఘట్టం విశ్వరూప దర్శనం సందర్భంగా పేరంటాళ్లకు అవమానం జరిగింది. పేరంటాల వేషధారి గంగమ్మ తల్లి వేషం వేసి చివరి రోజైన విశ్వరూప చెంప తొలగింపునకు ఆలయానికి చేరుకోవటం ఆనవాయితీ. అయితే. పేరంటాలు వేషధారి ఆలయానికి రాగానే గేట్లు మూసివేశారు. ఎంత చెప్పినా ఎవరూ పట్టించుకోకపోవడంతో పేరంటాళ్లు వెళ్లిపోయి నేరేళ్లమ్మ ఆలయానికి చేరుకున్నారు. తమ కుటుంబం తరతరాలుగా గంగమ్మకు సేవ చేస్తున్నా, ఇలా అవమానించడమేంటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలస్యంగా విషయం తెలుసుకున్న నిర్వాహకులు ఆలయానికి వెళ్లి పేరంటాళ్ల వేషధారిని బతిమలాడి తీసుకొచ్చారు.


ప్రతిమ వద్దకు తోసుకుంటూ వెళుతున్న టీడీపీ, జనసేన కార్యకర్తలు

రాజకీయ రగడ

అమ్మవారి విశ్వరూప దర్శనం సందర్భంగా రాజకీయ రగడ చోటుచేసుకుంది. గంగమ్మ నామస్మరణ మారుమోగాల్సిన ఆలయం టీడీపీ, జనసేన నాయకుల అరుపులు కేకలతో దద్దరిల్లింది. ఆలయంలోకి టీడీపీ నేతలను అనుమతించి, జనసేన నాయకులను అడ్డుకోవడంతో ఆ పార్టీ శ్రేణులు ధర్నాకు దిగాయి. దీంతో ఆలయం వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. ఇదిలా ఉంటే.. గంగమ్మ జాతర నిర్వహణపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అందులో భాగంగా ఓ భక్తుడు నిర్వాహకులు, పోలీసులను ప్రశ్నించారు. దీంతో వారు భక్తుడిని కొట్టుకుంటూ బయటకు తోసేశారు. అలాగే అమ్మవారి విశ్వరూపం చెంప నరకక ముందే కిరీటం తొలగించారు. ఈ విషయం గమనించిన పలువురు భక్తులు అప్పుడే తొలగించవద్దు అంటున్నా వినిపించుకునే నాథుడే కరువయ్యాడు. ఈ క్రమంలో విశ్వరూప దర్శనానికి వచ్చిన భక్తులు ఆందోళనతో ఆలయంలో జరుగుతున్న పరిణామాలను చూస్తుండిపోయారు. అధికారులు, కూటమి నేతల అలసత్వంతో గంగ జాతర నిర్వహణను గాలికి వదిలేయడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ధర్నాకు దిగిన జనసేన నేతలు




దౌర్జన్యంగా లోపలికి ప్రవేశిస్తున్న కూటమి నాయకులు


పేరంటాలును అడ్డుకుంటున్న నిర్వాహకులు

క్లుప్తంగా

వెటర్నరీ కళాశాలలో వీసీఐ బృందం


కళాశాల విభాగాలను పరిశీలిస్తున్న వీసీఐ బృందం

తిరుపతి సిటీ : ఎస్వీ వెటర్నరీ కళాశాలలో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (వీసీఐ) బృందం బుధవారం పర్యటించింది. సుమారు 10విభాగాలను పరిశీలించింది. అధ్యాపకుల వివరాలు, తరగతి గదులు, పాఠ్యాంశాల బోధనపై వివరాలు సేకరించింది.

భవితకు నైపుణ్యమే ప్రధానం


విద్యార్థులతో కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : భవిష్యత్ ఉత్తమంగా ఉండాలంటే నైపుణ్యం పెంపొందించుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ, నాస్కామ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు, ఏపీఎస్ఎస్‌డీసీ కో–ఆర్డినేటర్లకు బుధవారం కలెక్టరేట్‌లో సర్టిఫికెట్లు, బ్యాడ్జెస్ పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచం డిజిటల్ వైపు నడుస్తుందని, సాంకేతిక అంశాలను జోడించి ప్రత్యేక నైపుణ్యత సాధించిన వారికి చక్కటి భవిష్యత్ ఉంటుందని వెల్లడించారు. నాస్కామ్ డైరెక్టర్ ఉదయశంకర్, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి లోకనాథం పాల్గొన్నారు.

నేడే డీఎస్సీ దరఖాస్తుకు ఆఖరు గడువు

తిరుపతి సిటీ : టీచర్ పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వ విడుదల చేసిన డీఎస్సీ–2025కు దరఖాస్తుల స్వీకరణ గురువారంతో ముగియనుంది. ఈనెల 30వ తేదీ నుంచి హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకును అవకాశం ఉంటుంది. జూన్ 6వ తేదీ నుంచి జూలై 6వ తేదీ వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నారు.

అరకొరగా వసతి

- తిరుపతిలో లేని ప్రభుత్వ కళాశాలలు
- టీటీడీ ఆధ్వర్యంలోనే కాలేజీలే దిక్కంటున్న విద్యార్థులు
- ఒక్కో సీటుకు 200 మందికి పైగా పోటీ
- ప్రశ్నార్థకంగా అర్హులందరికీ హాస్టల్‌లో చోటు
- నేటి నుంచి టీటీడీ జూనియర్ కళాశాలల్లో ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ



తిరుపతి సిటీ : ప్రతిష్టాత్మక తిరుపతిలో పేద విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలల్లో విద్య అందుబాటులో లేకుండా పోయింది. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు తిరునగరంలో లేవంటే ఆశ్చర్యమేస్తోంది. పది పూర్తి చేసి ఇంటర్‌లో చేరాలనుకునే విద్యార్థులకు కేవలం టీటీడీ అధ్వర్యంలో నడుస్తున్న పద్మావతి జూనియర్ కళాశాల, ఎస్వీ జూనియర్ కాలేజీలే దిక్కు. రాయలసీమలో అన్ని జిల్లాల నుంచి టీటీడీ కళాశాలలో చేరేందుకు విద్యార్థులు పెద్దసంఖ్యలో పోటీ పడుతుంటారు. దీంతో సామాన్య పేద విద్యార్థులకు సీటు దొరికే పరిస్థితిలేదు. గత ఏడాది పదోతరగతిలో 600 మార్కులకు 530 సాధించిన విద్యార్థికి ఇంటర్‌లో ఎంపీసీ సీటు దొరకలేదంటే పోటీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ కళాశాలలు లేకపోవడంతో ప్రతిభగల విద్యార్థులు ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలను ఆశ్రయిస్తున్నారు.

తీవ్రంగా పోటీ

తిరుపతిలోని ఎస్పీడబ్ల్యూ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ కోర్సులకు సంబంధించి ఒక్కో సీటుకు సుమారు 200 మందికి పైగా పోటీ పడుతున్నారు. సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ కోర్సులకు సైతం ఒక్కో సీటుకు 70మందికి పైగా దరఖాస్తు చేసుకుంటున్నారు. ఎస్వీ జూనియర్ కళాశాలలోనూ ఇదే పరిస్థితి. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తోన్న మరో ఓరియంట్ కళాశాలలో 5ఏళ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీ కోర్సుపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడం, అధికారులు పట్టించుకోకపోవడంతో అందులో అడ్మిషన్లకు విద్యార్థులు మొగ్గు చూపడం లేదు. అలిపిరి డెఫ్ అండ్ డమ్ కళాశాలలో మాత్రం కొంత దివ్యాంగులకు ప్రవేశాలు సులువుగా లభిస్తున్నాయి.

ఇంటర్మీడియట్ సీట్ల వివరాలు

పద్మావతి జూనియర్ కళాశాలలో..		ఎస్వీ జూనియర్ కళాశాలలో..	
ఏంపీసీ	176	ఏంపీసీ	176
బైపీసీ	264	బైపీసీ	88
ఎంఈసీ	88	ఎంఈసీ	88
సీఈసీ	264	సీఈసీ	264
హెచ్ఈసీ	176	హెచ్ఈసీ	176
మొత్తం	968	మొత్తం	792
హాస్టల్ సీట్లు	450	హాస్టల్ సీట్లు	400

హాస్టల్‌లో సీటు దక్కేనా..?

టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్పీడబ్ల్యూ, ఎస్వీ జూనియర్ కళాశాలలో మంచి మార్కులు సాధించినా హాస్టల్ సీటు దక్కకపోవడం విచారకరం. పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లు సుమారు 968వరకు జరుగుతున్నా అందులో కేవలం 450మందికి మాత్రమే హాస్టల్ వసతి దక్కుతోంది. ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రుల సిఫార్సు లేఖలతో కొందరు విద్యార్థులు హాస్టల్ వసతి పొందుతున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల నుంచి పద్మావతి కళాశాలలో సీటు పొందిన విద్యార్థినులు హాస్టల్ వసతి లేక రూ.వేలు వెచ్చించిప్రైవేటు హాస్టల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. ఈ ఏడాదైనా అర్హులైన ప్రతి విద్యార్థికీ టీటీడీ యాజమాన్యం హాస్టల్ వసతి కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పెరగనున్న సీట్లు

టీటీడీ జూనియర్ కళాశాలలో ప్రస్తుతం ఎంపీసీకి 80సీట్లు ఉండగా ఈ ఏడాది పోటీని పరిగణలోకి తీసుకుని మరో 80సీట్లు పెంచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అలాగే ఎస్వీ జూనియర్ కళాశాలలోనూ పోటీ ఎక్కువగా ఉన్న ఎంపీసీ, బైపీసీ వంటి కోర్సులకు మరిన్ని సీట్లు పెంచనున్నారు. దీంతో మరో 200మంది విద్యార్థులు గత ఏడాది కంటే అదనంగా ప్రవేశాలు పొందే అవకాశముంది.

హాస్టల్ సీట్లు పెంచకుంటే ఉద్యమమే



ఎస్వీ, ఎస్పీడబ్ల్యూ జూనియర్ కళాశాలలతో పాటు డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పొంది హాస్టల్ సీటు అందక విద్యార్థులు నరకం అనుభవిస్తున్నారు. ఈ ఏడాది అర్హులైన ప్రతి విద్యార్థికీ హాస్టల్ వసతి కల్పించాలి. లేకుంటే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమిస్తాం. – శివశంకర్ నాయక్, జీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, తిరుపతి


దిక్కులేకనే తీవ్ర పోటీ



ఆధ్యాత్మిక నగరంలో ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయకపోవడం దారుణం. దీంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు.మంత్రుల దృష్టికి సమస్య తీసుకెళ్లినా స్పందించడం లేదు. వేరే దిక్కులేకనే సీటు కోసం తీవ్రంగా పోటీపడుతున్నారు.– హేమాద్రి యాదవ్, స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు, తిరుపతి

ఉపగ్రహాల నిఘా వ్యవస్థ బలోపేతం దిశగా ఇస్రో

- 18న పీఎస్ఎల్‌వీ సీ61 ద్వారా కక్షలోకి ఈఓఎస్ ఉపగ్రహం


పీఎస్ఎల్‌వీ సీ61 ద్వారా ప్రయోగించనున్న ఈఓఎస్-9 (రీశాట్-1బీ) రాడార్ ఇమేజింగ్ శాటిలైట్

సూళ్లూరుపేట: ఉపగ్రహాల నిఘా వ్యవస్థ బలోపతం, వాటి విస్తరణ వేగవంతం చేసేదిశగా ఈనెల 18న ఉదయం 6.59 గంటలకు పీఎస్ఎల్‌వీ సీ61 రాకెట్ ద్వారా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈఓఎస్ రాడార్ ఇమేజింగ్ ఉపగ్రహాన్ని సూర్య-సమకాలిక కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. ఈఓఎస్–09 (రీశాట్–1బీ) రాడార్ ఇమేజింగ్ ఉపగ్రహం బరువు 1710 కిలోలు. జాతీయ భద్రతను బలోపేతం చేయడం, కీలక మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతో దోహదపడుతుందని ఇటీవల ఇస్రో చైర్మన్ డాక్టర్ వీ నారాయణన్ తెలిపారు. ఈఓఎస్–09తో ఇస్రో పౌర,వ్యూహాత్మక ప్రయోజనాల కోసం అంతరిక్ష ఆస్తులను ఉపయోగించడంలో దాని సాంకేతిక నైపుణ్యం, నిబద్ధతను ప్రదర్శిస్తుంది.

రాబోయే ఐదేళ్లలో 52 ప్రైవేటు ఉపగ్రహాలకు..

భవిష్యత్తులో భారత్ ప్రపంచంలోనే బలీయమైన శక్తిగా అవతరించేందుకు అంతరిక్షంలో నిఘా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆదనంగా మరిన్ని ఉపగ్రహాలను ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలను రచిస్తోంది. ఇందులో భాగంగా రాబో యే అయిదేళ్లలో ప్రైవేటు రంగం నుంచి బలమైన భాగస్వామ్యంతో 52 ఉపగ్రహాల సమూహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టే దిశగా ఇస్రో అడుగులు వేస్తుంది.ఈనెల జూన్, జులై నెలల్లో హై ప్రొఫైల్ మిషన్ల ప్రయోగాలకు సన్నాహాలు చేస్తున్నారు.

ఉద్యోగం..లక్ష్యానికి ఆరంభం


ప్లేస్‌మెంట్ సాధించిన విద్యార్థులు

- ఎంబీయూలో ఘనంగా అచీవర్స్ డే

చంద్రగిరి : ఉద్యోగం అనేది మీ జీవిత లక్ష్యానికి కేవలం ఆరంభం మాత్రమే అని, మీ ఉన్నతికి పడిన తొలిమెట్టుగా భావించి మరింత ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కృషి చేయాలని మోహన్ బాబు యూనివర్సిటీ (ఎంబీయూ) ప్రో చాన్సలర్ మంచు విష్ణు తెలిపారు. బుధవారం తిరుపతికి సమీపంలోని ఎంబీయూలో అచీవర్స్ డే–2025 కనిర్వహించారు. ఈ విద్యాసంవత్సరంలో ప్లేస్‌మెంట్లు సాధించిన సుమారు 1,500 మంది విద్యార్థులు హాజరయ్యారు. విష్ణు మాట్లాడుతూ.. ఉద్యోగం ఇచ్చిన సంస్థ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. జీతం కోసమే కాకుండా మీ లక్ష్యాన్ని అధిగమించేలా పనితీరు ఉండాలని కోరారు. అనంతరం ప్లేస్‌మెంట్ సాధించిన విద్యార్థులకు పలు కంపెనీల నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, ప్రో వోస్ట్ నాగరాజ రామారావ్, వీసీ కరుణాకరణ్, స్ట్రాటజిక్ అధికారి వికాస్ సింగ్, రిజిస్ట్రార్ సారథి పాల్గొన్నారు.

నేడు పెన్ స్టేట్ వర్సిటీతో ఎంఓఏ

అమెరికాలోని పెన్ స్టేట్ యూనివర్సిటీతో మెమోరాండం ఆఫ్ అసోసియేషన్(ఎంఓఏ) గురువారం చేసుకోనున్నట్లు ఎంబీయూ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి పెన్ స్టేట్ యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ డేవిడ్ ఎం కాల్లెజో పెరెజ్, వీసీ డాక్టర్ వాహిద్ మోటివల్లి హాజరుకానున్నారని వెల్లడించారు.

నిధుల సేకరణకు యాక్షన్‌ప్లాన్

- స్విమ్స్ జనరల్ కౌన్సిల్ సమావేశంలో టీటీడీ చైర్మన్


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్, ఈఓ

తిరుపతి తుడా : టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆస్పత్రుల నిర్వహణ కోసం నిధులు సేకరణకు యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నామని టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. బుధవారం స్విమ్స్ జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్విమ్స్ అభివృద్ధి, మెరుగైన వైద్యసేవలు అందించే విషయంపై టీటీడీ మాజీ ఈఓ ఐవీ సుబ్బారావు అధ్యక్షతన వేసిన ప్రత్యేక ఎక్స్‌పర్ట్ కమిటీ నివేదికను సమర్పించిందన్నారు. ఆ మేరకు ఖాళీగా ఉన్న 597 వైద్య సిబ్బంది, 434 నర్సులను భర్తీ చేయాల్సి ఉందని వెల్లడించారు. దీంతో స్విమ్స్‌కు ప్రస్తుతం అందిస్తున్న రూ.100 కోట్లకు తోడు అదనంగా రూ.70కోట్ల భారం టీటీడీపై పడుతుందని వివరించారు. టీటీడీ ఈఓ శ్యామలరావు మాట్లాడుతూ నిధుల సేకరణకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఎక్స్‌పర్ట్ కమిటీ నివేదికపై జనరల్ కౌన్సిల్‌లో చర్చించామన్నారు. అనంతరం స్విమ్స్ ఆవరణలో నిర్మిస్తున్న క్యాన్సర్ సెంటర్ భవనం పరిశీలించారు. సమావేశంలో ఎక్స్‌పర్ కమిటీ చైర్మన్ ఐవీ సుబ్బారావు, సభ్యులు జేఎస్ఎన్ మూర్తి, తేజోమూర్తుల రామోజీ, డాక్టర్ విజయ్ కుమార్, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, టీటీడీ బోర్డు మెంబర్లు సుచిత్ర ఎల్లా, సదాశివరావు, జేఈఓ వీరబ్రహ్మం, సీతః సత్యనారాయణ పాల్గొన్నారు. వర్చువల్‌గా హెల్త్ స్పెషల్ సీఎస్ కృష్ణబాబు, ఎండోమెంట్ సెక్రటరీ వినయ్ చంద్ హాజరయ్యారు.

కల్కి భూములపై విచారణ


రైతులతో మాట్లాడుతున్న డీఐ ప్రసాదరావు

వరదయ్యపాళెం: ఉబ్బలమడుగు పర్యాటక కేంద్రం సమీపంలోని వివాదాస్పద కల్కి ట్రస్టు భూములకు సంబంధించి బుధవారం రెవెన్యూ , అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టారు. గతంలో ఈ భూములకు సంబంధించి కొందరు ప్రభుత్వానికి ఫిర్యాదులు చేశారు. ఆ మేరకు కల్కి ట్రస్ట్ ప్రతినిధులు, స్థానిక రైతులతో సర్వే డీఐ ప్రసాదరావు, అటవీశాఖ అధికారులు సమావేశమయ్యారు. సంబంధిత భూములు కల్కి ట్రస్టుకు ఎలా చెందాయో వివరాలను పరిశీలించారు. అలాగే స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయి రికార్డులను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తామని సర్వే అధికారులు తెలిపారు.

ఏపీఆర్‌జేసీ, పాలిసెట్‌లో 'విశ్వం' జయకేతనం


ఏపీఆర్‌జేసీలో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : ఏపీఆర్‌జేసీ, పాలిసెట్ ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారని సంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఏపీఆర్‌జేసీలో వై.దేదీప్య రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు, కె.మునిరూపేష్ 7వ ర్యాంకు, జె.అంజలి 9వ ర్యాంకు, మనీషా 10వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే రేవంత్, అబ్దుల్ ఖాదర్, యోగి, సమత, భవ్యశ్రీ గీతిక, రోషన్, ట్వింకిల్, సంతోష్, భువన, కార్తికేయ తదితరులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. పాలిసెట్ ఫలితాల్లో ఎం.కావ్య 120మార్కులకు 117మార్కులు సాధించి బాలికల విభాగంలో జిల్లా స్థాయి ఉత్తమ ర్యాంకును సాధించినట్లు తెలిపారు. కిమ్యశ్రీ 116, కె.నిత్యశ్రీ 114, అబ్దుల్ ఖాదర్ 113, సుజినిరెడ్డి, చాతుర్య, రాజకుమారీ 112, ఎస్.రోషన్ 111, చేతన్‌రెడ్డి 110, జస్మిత 109మార్కులతో జిల్లా స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు వివరించారు. రాణించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ ఎస్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ తులసీ విశ్వనాథరెడ్డి అభినందించారు.

పొదుపు సంఘాలతో పెట్రోల్ బంకులు

తిరుపతి అర్బన్ : పట్టణ ప్రాంతాల్లోని పొదుపు సంఘాల మహిళలతో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయించాలని మెప్మా పీడీ రవీంద్రను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. స్థల సేకరణ నిర్ధారిస్తే అనుమతులు ఇస్తామని వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, మెప్మా పీడీ, పలువురు బ్యాంక్ అధికారులతో వర్చువల్‌గా ఆయన రివ్యూ నిర్వహించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ విశ్వనాథరెడ్డి, పరిశ్రమల శాఖ జిల్లా అధికారి సుధాకర్ పాల్గొన్నారు.

'ష్యూర్ సక్సెస్' నీట్ లాంగ్ టర్మ్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అకాడమీ నిర్వాహకులు

తిరుపతి రూరల్ : తిరుపతి సమీపంలోని తాటితోపు వద్ద సుమిత్ర టవర్స్‌లో శ్రీ సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ వారు ప్రత్యేకంగా రూపొందించిన నీట్ ష్యూర్ సక్సెస్ ప్రోగ్రామ్‌ను బుధవారం ప్రకటించారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించినట్లు కరెస్పాండెంట్ శేషారెడ్డి తెలిపారు. ఈ పోస్టర్లను విడుదల చేశారు. అభ్యాసం, విద్యార్థులకు మెరుగైన గుణాత్మక శిక్షణను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. 90 శాతం హాజరు ఉన్న విద్యార్థులకు నీట్-2026లో 500మార్కులకు తక్కువ వస్తే 50శాతం ఫీజు రీఫండ్ చేస్తామని స్పష్టం చేశారు. వివరాలకు అకాడమీ సెంటర్, లేదా 9133380222 నంబరులో సంప్రదించాలని సూచించారు.

తిరుమలలో సెక్యూరిటీ తనిఖీలు


తనిఖీలు చేస్తున్న అధికారులు

తిరుమల : తిరుమలలో బుధవారం సాయంత్రం సెక్యూరిటీ ఆడిటింగ్ కమిటీ మెంబర్లు సునిత్ గరుడ, ఆరిఫ్ హాఫ్ , ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. అలిపిరి చెకింగ్ పాయింట్, నడక మార్గం, శ్రీవారి పాదాలు ఘాట్ రోడ్డు, హథీరాంజీ మఠం, శ్రీవారి ఆలయంలో బూందీ పోటు, మాడ వీధులు, అన్నప్రసాద కేంద్రం, వైకుంఠం – 1, ఔటర్ రింగ్ రోడ్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. గుర్తించిన అంశాలపై గురువారం సమీక్షించనున్నారు.

మహిళ ఆత్మహత్య

గూడూరురూరల్ : పట్టణ సమీపంలోని టిడ్కో ఇళ్ల వద్ద ఓ మహిళ బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. మనుబోలుకు చెందిన గునపాటి ఏడుకొండలు భార్య హేమలత (27) కొంతకాలంగా ఓజిలి మండలం కురుగొండ గ్రామానికి చెందిన రషీద్‌తో సహజీవనం చేస్తోంది.ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో హేమలత ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీర జవాన్లకు రూ.లక్ష విరాళం


తల్లిదండ్రులతో కలసి కలెక్టరకు డీడీ అందిస్తున్న చిన్నారులు

తిరుపతి అర్బన్: వీర జవాన్లకు ముగ్గురు చిన్నారులు రూ.లక్ష విరాళం అందించారు. బుధవారం ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు తిరుపతి చెందిన అనిరుధ్, అశ్రీధ్, సుచిత్ర డీడీ అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


మృతి చెందిన కృష్ణన్ పెరుమాళ్, రామన్ మధు

ఏర్పేడు(రేణిగుంట) : ఏర్పేడు మండలం మేర్లపాక దళితవాడ వద్ద బుధవారం వేకువజామున జరగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాలు.. తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లా నల్లంబల్లి తాలూక, ఎర్రబైనహళ్లి సమీపంలోని నెక్కుంది గ్రామానికి చెందిన కృష్ణన్ పెరుమాళ్, రామన్ మధు(46)నాటుకోళ్లను తీసుకుని బొలెరో వాహనంలో వస్తూ వెనుకనుంచి లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కృష్ణన్ పెరుమాళ్, రామన్ మరణించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి కుటుంబీకులకు అప్పగించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ట్రెక్కింగ్‌పై విచారణకు ఆదేశం

భాకరాపేట : అభయారణ్యంలో ఎలాంటి అనుమతులు లేకుండా ట్రెక్కింగ్ చేస్తున్నవారిపై కేసులు నమోదు చేయనందుకు అటవీశాఖ జిల్లా అధికారి వివేక్ బుధవారం భాకరాపేట ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, తలకోన సెంట్రల్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, తలకోన సెక్షన్ ఫారెస్టు ఆఫీసర్‌కు మెమోలు జారీ చేశారు. దీనిపై విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని పేర్కొన్నారు.

గురుకులం విద్యార్థికి అవార్డు


ఇంద్రజను అభినందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

వెంకటగిరి రూరల్ : పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండో స్థానం దక్కించుకున్న గురుకుల బాలికల పాఠశాలకు విద్యార్థిని కలపాటి ఇంద్రజ షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైంది. బుధవారం ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో విద్యార్థినికి కలెక్టర్ వెంకటేశ్వర్ ల్యాప్‌టాప్ అందించారు. అలాగే డీఈఓ కేవీఎన్ కుమార్, ఎంఈఓలు వెంకటేశ్వర్లు, బాబయ్య, ప్రిన్సిపల్ రజని అభినందనలు తెలిపారు.

అర్హులందరికీ రుణాలు


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రవికుమార్

తిరుపతి అర్బన్ : అర్హులందరికీ రుణాలు మంజూరు చేయాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ రవికుమార్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్‌గా రవికుమార్ బాధ్యతలు చేపట్టిన అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్‌కు అవార్డు


ప్రిన్సిపల్ గంగాభవానీని అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ : విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గంగా భవానీకి ఉత్తమ నర్సింగ్ పరిశోధకులు అవార్డు ప్రదానం చేశారు. ఆగ్యోగశాఖ మంత్రి చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు. బుధవారం ఈ మేరకు వర్సిటీలో వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజని అభినందనలు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి హత్య

శ్రీకాళహస్తి: గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన నీలకంఠేశ్వరాలయానికి వెళ్లే మార్గంలో ఉన్న శ్మశాన వాటికలో బుధవారం వెలుగుచూసింది. 1వ పట్టణ సీఐ గోపి కథనం మేరకు.. గుర్తు తెలియని వ్యక్తి(40) మృతదేహం ఉన్నట్లు స్థానికుడు అందించిన సమాచారంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతుడి ఒంటిపై కత్తిపోట్లు ఉన్నట్టు గుర్తించారు. హత్యకేసుగా నమోదు చేశారు.

జాతరలో దొంగ అరెస్ట్

తిరుపతి క్రైమ్: గంగ జాతరలో వచ్చే భక్తుల వద్ద నగలు అపహరిస్తున్న దొంగను క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. మంగళవారం గంగమ్మ జాతరలో మహిళ మెడలో గొలుసు చోరీ చేసిన కావడి గంగమ్మను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 24 గ్రాముల బంగారుఆభరణం స్వాధీనం చేసుకున్నారు.

భవనంపై నుంచి పడి కూలీ మృతి

తిరుపతి క్రైమ్ : తిరుపతిలోని టీటీడీ ప్రెస్ బిల్డింగ్ వెనుక నిర్మిస్తున్న నూతన భవనంపై నుంచి పడి ఓ కూలీ మృతి చెందాడు. వివరాలు..ఒడిశాకు చెందిన రవీంద్ర కట్వార్(42) కూలి పని చేస్తుండగా బుధవారం మూడో అంతస్తు నుంచి కింద పడిపోయాడు. వెంటనే రుయా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.